ముక్కుపుల్ల

"మా యింటిని చేపల బజారుగా మార్చి పారేశారు కదా మీరు! యిరుగు పొరుగు వాళ్ళంతా పెద్ద న్యూసెన్సుయిపోయిందని గోలపెడుతున్నారు. వీధిలో తలెత్తుకుని తిరగలేకపోతున్నాము. వున్నపాళాన మా షెడ్డును ఖాళీచేసి బయటికి నడవండి" అంటూ అరిచాను కోపంగా.

"నువ్వుగూడా పొమ్మంటే యెక్కడికి పోతామమ్మా" అంది నీలమ్మ వెనుదిరిగయినా చూడకుండా. ఆ స్వరంలో వేడికోలు లేదు. పోకపోతే నువ్వేం చేస్తావన్న ధీమా మాత్రమే తొంగిచూస్తోంది.

నీరసంగా నులక మంచం పైన చేరగిలబడ్డాను.

కాంపౌండ్ గోడకవతలి రోడ్డుపైనుంచీ వాహనాల రాకపోకల సవ్వడి పెద్దగా వినబడుతోంది. పెరట్లో క్రోటనుమొక్కలు కళకళలాడుతున్నాయి. మునగచెట్టు తెల్లటి పూతతో పెళ్ళికూతురిలా ముస్తాబై వుంది. కరివేపాకు చెట్టు పేరంటాలిలా నిండుగా వుంది. కాంపౌండు కవతలున్న దిరిసెన చెట్టు - నా చేతులతో నేను నాటిన మొక్క - చాపిన కొమ్మల కింద, ఆస్‌బెస్టాస్ షీట్లతో కట్టిన షెడ్డు పక్కన, రాళ్ళతో ముక్కోణంలా తయారు చేసిన పొయ్యి ముందు, వీపు నాకేసి తిప్పుకుని కూర్చుని, బియ్యం గాలిస్తోంది నీలమ్మ. షెడ్డు ముందున్న కొబ్బరికీతుల పందిరి వాసానికి బిడ్డ నిద్రిస్తున్న వుయ్యాలొకటి వేలాడుతోంది. నీలమ్మ కటువైపున కూర్చున్న నాలుగేళ్ళ పిల్ల సత్తు కంచం లోంచీ చద్దన్నం తింటోంది.

బాగా విశాలమైన పెరడు. యెప్పుడో పాతికేళ్ళకు ముందు, వూరింతగా పెరగక పూర్వం, యెకరాల లెక్కలో మావారు కొన్న భూమి యిది. అప్పట్లో బాగా చౌక. యిప్పుడిది వూళ్ళోని ధనవంతులు మాత్రమే నివసించడానికి వీలయ్యే పోష్ లొకాలిటీ. రేటు పెరుగుతోందికదా అని యెప్పటికప్పుడు దీని అమ్మకాన్ని ఆయన వాయిదా వేస్తూ వస్తున్నారు. ఖాళీ స్థలంలో టేకు మొక్కలూ, కొబ్బరి, నిమ్మ, జామ చెట్లూ పెట్టాం. పెద్ద తోటలా తయారయింది. దాదాపు రెండెకరాల సైటు మాది. రెండువైపులా సరిహద్దులా రెండు వీధులున్నాయి. మా యిల్లు అటువైపు వీధికి దగ్గరగా వుంటుంది. పెరటివైపు ప్రహరీ గోడ దగ్గరున్న చిన్న గేటుకు దగ్గరగా, యిల్లు కడుతున్న సమయంలో వాచ్‌మెన్ కోసమని యీ షెడ్డును కట్టించాము.

కడిగిన బియ్యాన్ని తాపీగా పొయ్యి పైన డేగిశాలోకి పోశాక, నెమ్మదిగా తిరిగొచ్చి నా ముందు నేలపైన గొంతుక్కూచుంది నీలమ్మ. వోసారి పెద్దగా ముక్కు చీదుకున్నాక, "నీ మనవరాల్నీ, మనవడ్నీ దినమ్మూ రిక్షాలో యిస్కూలుకి తీసుకోని పోతానని వప్పందం చేసుకున్న పెద్దమనిషి! మాటిచ్చినాక దానికి కట్టుబడి వుండాల్నా, పన్లేదా? మాట నిలకడ లేని మనిషితో కాపరం జేసే శక్తి నాకు లేదు తల్లా! నిన్నటి దినంతో వానికీ, నాకూ తెగతెంపులయిపోయినాయి. యింక యీ పక్కకు తిరిగి చూడనని మొరాయించుకోని పోయినాడు..." అంటూ నింపాదిగా, నిబ్బరంగా చెప్పుకుపోతోంది ఆమె. "నాకుండేది ముగ్గురు బిడ్డలు. పెద్ద బిడ్డను మా అమ్మానాయినా సాకేస్తా వుండారు. మిగిలుండేది యీ రెండు పసికందులు. యింకొకరి కష్టంలో పొయ్యే మనిషిగాదు నేను. యేదయినా రెండిండ్లు చూపించి పుణ్యం గట్టుకో! ఆ పనీ యీ పనీ జేసుకోని నా బతుకు నేను బతకుతాను..."

నీలమ్మ జీరబోయిన గొంతుతో వేడుకోవడంతో నాకు జాలేసింది. అంతలో ఆవిడ తెలివిగా పన్నుతున్న వలలో తగులుకుపోతున్నానన్న విషయం స్ఫురించింది. "వాడు పిల్లల్ని రిక్షాలో తీసుకెళ్ళేనంత కాలం మా షెడ్‌లో వుండనిస్తానని గదా వప్పందం! వాడే లేకపోయిన తర్వాత యీ సంతంతా యిక్కడెందుకు? అందరూ దయచెయ్యండి బయటికి," అన్నాను వెక్కసంగా

"దానికోసరం దిగులు పెట్టుకోవద్దమ్మా! రిక్షా యీడనే వుండాదిలే" అంటూ తన అభయహస్తాన్ని ప్రహరిగోడ పక్కనున్న రిక్షాకేసి చాపింది నీలమ్మ.

"రిక్షా కనిపిస్తోందిలే! తొక్కేదెవరు? నువ్వే తొక్కుతావా కొంపదీసి..." అన్నాను మండిపడిపోతూనే.

"అదేమైనా బ్రమ్మవిద్యా! అయినా, నేను తొక్కన్లే! సుబ్రమణి వుండాడు..." మళ్ళీ తన వంటపని కొనసాగిస్తూ నీలమ్మ సమాధానం చెప్పింది.

"సుబ్రమణా? వాడెవుడు?"

"వెంకటాపురం నుంచీ వచ్చినాడులే! నాలుగు దినాలుగా యీడనే వుండాడు..."

"మిమ్మల్నిద్దర్నీ వుండమన్నాను గానీ, యిలా గుంపు గుంపునంతా వచ్చి చేరిపొమ్మని చెప్పలేదు నేను." యెంత ఆపుకుందామనుకున్నా కోపం ఆగడం లేదు నాకు. వూగిపోతూ అరవసాగాను. "పోయిన నెలలో వచ్చినప్పుడు వాళ్ళెవరో యిద్దరున్నారిక్కడ. అడిగితే నీ మొగుడు పిన్నమ్మా, చిన్నాయనా అన్నాడు. పోయిన వారం వచ్చినప్పుడు యింకో జత కనిపించారు. అత్తామామా అన్నాడు. యిప్పుడీ సుబ్రమణి. తండాకు తండానే దిగబడి, తాగి తందనాలాడి, రోజుకో జాతర తయారుచేసి, మమ్మల్ని వీధిలోకి లాగడమేనా మీ పని!"

"అంతా ఆ మహన్నబావుడి బందువర్గమే తల్లా! నా సుట్టమెవరూ రాగూడదు. వస్తే కండ్లల్లో నిప్పులు బోసుకుంటాడు. నా యెదాన పడినోళ్ళను పొమ్మన్నాననే గదా నిన్నంత రగడ జరిగింది." తాటాకు బొమ్మలా చేతులు తిప్పుతూ నీలమ్మ రవాయించింది.

"నిజమే! తప్పు నీదిగాదు. నీ మొగుడిదీ గాదు. షెడ్డు ఖాళీగా వుంది గదా అని, మా ఆయనతో చెప్పి వప్పించి మిమ్మల్ని లోపలికి రానిచ్చింది నేనే! తప్పంతా నాదేలే." చివరకు పరాజయాన్ని వొప్పుకుంటున్నట్టుగా చేతులు పైకెత్తేశాను.

నీలమ్మ మరో రెండడుగులు ముందుకొచ్చి నిలబడి రెండు చేతులూ జోడించుతూ, "పెట్టేతల్లినే అడగమన్నారు గదమ్మా పెద్దోళ్ళు. నువ్వు గాకపోతే నాకు అయ్యోమనే వాళ్ళు యెవరుండారు?" అంటూ ప్లేటు ఫిరాయించేసింది. "చెప్పిన మాట వినకుండా యీ మగోడ్ని పెండ్లాడినానని మా నాయిన నా ముఖం చూసేది లేదు. వీడేమో వాని కడుపే కైలాసమంటాడు. పగుల్లో రిక్షా తొక్కి సంపాదించిందంతా సాయింత్రానికి వోటలోళ్ళ పరం జేసేస్తాడు. మిగిలిందాంతో సారాయి తాగేసి, పెండ్లాం బిడ్డల కడుపు కాలేటట్టుగా గురకలు దీస్తాడు. నా కష్టమూ నష్టమూ చెప్పుకునే దానికి నువ్వు తప్ప నాకు దిక్కెవరుండారు తల్లా!"

కాస్సేపు ఆమె ముఖంలోకే చూస్తూ వుండిపోయిన తర్వాత, మంచం కోడుకు ఆనుకుని కూర్చుంటూ "యెంతకయినా తగిన దానివేలే నువ్వు"

అన్నాను మెల్లగా. "నిన్న మొన్నటిదాకా నీ మొగుడికి తాగుడు అలవాటే లేదన్నావు. చుట్టుపక్కల వాళ్ళు చెప్పిన మాటలన్నీ తప్పులని ప్రమాణాలు చేశావు. యిప్పుడు మాత్రం నువ్వు చెబుతున్న మాటలు నిజాలేనన్న గ్యారెంటీ యేముంది? నిన్నెలా నమ్మడం?"

నీలమ్మ పందిరి కూసం పైన వాలిపోతూ, "యింటి గుట్టును బయట పెట్టుకునేది మంచిది గాదు గదా అమ్మా" అంది. "అయినా, యెంతకాలమని మూసి పెట్టుకునేదానికి కుదరతాది? ఆ మనిషిని పెండ్లాడిన దినంనుంచీ యెన్ని అగచాట్లు పడినానో నాకు దెలుసు, ఆదేవుడికి తెలుసు. అయినోళ్ళ నందరినీ కాదని వచ్చినాను గదా! ఆ మాటయినా గెవనముండాదా వానికి? సంకలో బిడ్డ లేకుంటే నేను గూడా కూలీనాలీ చేసుకోని రెండు రూకలు సంపాదించుకోని గుట్టుగానే సంసారం జేసుకోనుందును. యింట్లో వుండే పెండ్లాం బిడ్డలకు పిడికెడు నూకలైనా తేవాలని ఆ మనిషి అనుకోడు. చాలనిదానికి యీ గుంపునంతా తెచ్చి నా నెత్తిపైన దిగేస్తాడు. నాకే లేదు. వీళ్ళకు వండివార్చలేదని రోదన. యీ కస్మాలం బతుకు నేను బతకలేను."

"గుంపు గుంపని నోటికొచ్చినట్టుగా కూస్తా వుండావు. నీ రెక్కలకష్టమేమన్నా వూరికే తింటావుండామా మేము! యీ జోబిడిలో వుండే దానికని నెలకు యాభైరూపాయల బాడిగ తీసుకుంటా వుండావా లేదా నువ్వు! కొంచెం కండ్లు నేలమీద పెట్టుకోని చూడు..."

కొత్తకంఠం వినిపించేసరికి వులిక్కిపడి తిరిగి చూశాను. షెడ్డు వాకిలి దగ్గర పొట్టిగా, గుండ్రంగా, చీరకట్టిన రుబ్బురోలులా కనిపించిందొక వ్యక్తి. నెరిసిన వెంట్రుకల తల చిందరవందరగా రేగివుంది. వుబ్బిన బుగ్గలకింద తమల పాకులు నలుగుతున్నాయి.

"అమ్మా తల్లా! నీ నోటికొచ్చే బిడువు నాకు లేదు. నిన్నెవురూ వక్కాకు పెట్టి పిలవలేదు." ఆవిడ వైపుకు తలతిప్పయినా చూడకుండా నీలమ్మ చేతులు పైకెత్తి నమస్కారం చేస్తోంది.

"యీవిడేనా నీ మొగుడికి మేనత్త" అని అడిగాను జ్ఞాపకాల తెరలు తిప్పుతూ.

"కాదమ్మా! దొరసామి నాకు కొడుకు వరసవతాడు. అత్త అయితిందని గూడా జూడకుండా యెంతలేసి మాటలు మాట్లాడతా వుండాదో చూడు. సంసారులెవ్వురైనా యీ పాటు పడతారా?" అంటూ ఆవిడ నన్నే మధ్యస్తానికి ఆహ్వానించింది.

"యీ పుణ్యాత్ములు రాక ముందు ఆ మనిషి గూడా బాగనే వున్నాడమ్మా! యీమె మొగుడు దినమ్మా దీపాలుపెట్టే టయానికి గుర్రమెక్కేస్తాడు. చాలనిదానికి మా మనిషిని గూడా దోవ దప్పించేసినాడు." నీలమ్మ గూడా తన వాదంతో సన్నద్ధురాలైపోయింది.

"అప్పుటికి నీ మొగుడు నోట్లో యేలు బెట్టినా కొరకలేడు. నా మొగుడికి యింకోపని లేదు. దోవన బోయ్యే వాళ్ళందరికీ మందు తాగేది నేర్పించేదే సేద్యం" అంది ఆవిడ వెటకారంగా.

"ముందు నువ్వు మర్యాదగా బయటికి నడువు. మిమ్మల్నంతా యిక్కడి కెవురు రమ్మన్నారు?" అంటూ ఆవిడను మందలించాను.

"మేమేమీ గతిలేకుండా యిక్కడికి రాలేదమ్మా! మాకా గంగమ్మ గుడికాడ యిల్లుండాది" అంది ఆమె.

"అయితే, యిక్కడికెందుకొచ్చినావు? అక్కడికే పో..." అంది నీలమ్మ పుల్ల విరిచినట్టుగా.

"పోతాం లే! ముందు నా నూరు రూపాయలు నా చేతిలో పెట్టు."

"దుడ్డు నాకిచ్చినావా నువ్వు?"

"నీ మొగుడి కిస్తే నీకిచ్చినట్టు గాదా?"

"వానికీ, నాకూ యిప్పుడు సంబంధమేమీ లేదు."

అక్కడ నేను కూర్చుని వున్నానన్న సంగతిని గూడా మరచిపోయి. వాగ్వివాదంలోకి దిగేశారు వాళ్ళిద్దరూ. నాకు చిర్రెత్తుకొచ్చింది. "మా యింటిని ఫ్లాట్‌ఫారంగా తయారు చేసేశారు మీరంతా! ముందు అందరూ ఖాళీ చేసి వెళ్తారా? లేకపోతే పోలీసుల్ని పిలవమంటారా?" అని కసిరాను.

ఆ నడివయసు స్త్రీ కాస్సేపు నాకేసి అదోలాచూస్తూ నిలబడిపోయింది. ఆ తరువాత నీలమ్మకేసి తిరిగి "సాయంత్రం నామెగుడు రానీ! అప్పుడు చెప్తాను నీపని" అంటూ బయటికి వెళ్ళిపోయింది.

నీలమ్మ పొయ్యిలోకి మరో రెండు కట్టెల్ని దూరుస్తూ, "మంచి పని చేసినావమ్మా! పోలీసులంటే ఆ నా సవితికి భలే బయిం" అంది పెద్దగా నవ్వేస్తూ

ఆమె వ్యవహారమేమిటో నాకెంతకూ అంతు బట్టడం లేదు. యిక్కడ తానేం చేసినా చెల్లుబాటయి పోతుందని అనుకుంటోంది కాబోలు.

నా ధోరణిని గమనించనట్టుగా నీలమ్మ వయ్యారంగా నడుముపైన చేయివేసుకుని నిల్చుంటూ, "అసలీ ఆడముండవల్లే గదమ్మా రోజూ రోదన"

అంటూ తన వాదాన్ని నిగుడించింది. "ఆ మొగుడనే మనిషి ప్రతి సాయింత్రమూ పూటుగా తాగేసి వస్తాడు. యిది వాని నోటికి హితవుగా వంటజేసి పెట్టదు. చాలనిదానికి వాడొక్కడే తాగేసి వచ్చినందుకు తనకలాడిపోతింది. దానికోసరమని వొకమందు పొట్లమైనా తేలేదేమని పోరు బెడ్తింది. వాడు పేట్రేగిపోతాడు. వాని చెయ్యాడనూ, దీని నోరాడనూ యిదే గదా దినమ్మూ జరిగే భాగోతం..."

"యిది గూడా సారాయి తాగుతుందా?" ఆశ్చర్య పడిపోయాను.

"మెల్లింగా అడగతావా ఆ మాట! దానిది కడుపుగాదు. కల్లూరు తూము. దీని బాధ భరాయించలేకనే తొలీ మొగుడు గుండెపోటొచ్చి పోయినాడు..." అదేదో ఘనకార్య మయినట్టుగా కళ్ళెగరేసి, వంకర నవ్వు నవ్వుతోంది నీలమ్మ.

"వీడు రెండో మొగుడా దీనికి?" యింకా అదే ఆశ్చర్యాన్ని పొడిగించాను.

"అయ్యో రామా! యీ మొగోడికీ పెండ్లాముండాది. బిడ్డలుండారు. అందరికీ పెండ్లిండ్లయిపోయినాయి. యీ సావిత్రమ్మ మా మొగోనికి సాయానా చిన్నాయిన పెండ్లాం. దీనికీ మనవళ్ళూ మనవరాళ్లూ వుండారు. మొగుడు పోయిన మూడో నాటికంతా యీ మనిషిని తగులుకునింది యిది. బలవంతంగా వాణ్ణి తొడుక్కోనొచ్చి మా అంచన చేరింది. నెలకో రెండు రూకలు వస్తాయిగదా అని, చన్నీళ్ళకు యేన్నీళ్ళుగా వుంటాది గదా అని యింట్లోకి రానిచ్చినాను. చూసేదానికి ముసిలిది మాదిరిగా వుండాదని అనుకునేవు. దీనికెప్పుడూ అదే యావ! ఆ మొగోని మింద భలే అనమానం. సందు దొరికిందంటే ఆ మనిషిని నసపెట్టి చంపేస్తింది. రాత్రుల్లో ఆ పక్కన పండుకుంటారు గదా యిద్దురూ! యీ పక్కన మేముండాముగదా అని గూడా అనుకోరు. దాని గోకుడుకూ, వాని నసుగుడుకూ - మేము నవ్వలేక సస్తామనుకో..." నీలమ్మ సిగ్గు పడడంలేదు, పరవశంగా నవ్వుతోంది.

"యిలాంటి మనిషిని మాయింటిలోకి రానిచ్చావా? చీమకు పెత్తన మిచ్చినట్టయిందే నాకథ!" కోపంతోనూ, అసహ్యంతోనూ నా గొంతు వణక సాగింది. "యెంత వొళ్ళు కొవ్వెక్కితే మాత్రం, యీ వయసులో కన్నబిడ్డల్ని వదిలిపెట్టి బరితెగించి తిరుగుతారా యెవరైనా? యిది మనిషిగాదు. పశువు. పశువులు కూడా యిలా తిరగవు."

"యే మాట కామాటే చెప్పాలమ్మా! యీ మనిషికి బిడ్డలంటే బలేభ్రమ. నెలకో, రెండు నెలలకో వొకతూరి వాళ్ళ వూరికి పోయొస్తుంది. కలిగిందేదో వాళ్ళకిచ్చేసి వస్తింది" అంది నీలమ్మ నవ్వుతూనే.

"యిది తీసుకుపోతే మాత్రం వాళ్ళెలా తీసుకుంటారు? అసలు వాళ్ళు దీన్ని దగ్గరికి రానిస్తారా యింకా గూడా?" నాకెందుకో సావిత్రమ్మ పైన చెప్పలేనంత అక్కసుగా వుంది.

"యెందుకు రానియ్యరమ్మా! దుడ్డంటే వాళ్ళకేమైనా చేదా? ఆ వూర్నించీ వచ్చినప్పుడు చూడాల దాని సంబరం. ఆ కొడుకుల గురించీ, కోడళ్ళ గురించీ చెప్పిచెప్పీ మమ్మల్ని వూదరగొట్టేస్తింది."

చీడ తగిలిన చెట్టులా నా మనసెందుకో విలవిలలాడిపోతోంది. యెవరో బలవంతంగా నాలోని శక్తినంతా లాగేసినట్టుగా తోస్తోంది.

బయట యెండ మండిపోతోంది. కొబ్బరి చెట్ల పైన కోతుల మూక గెంతుతోంది. జామచెట్టు మొదట్లో వుడతలు రెండు వొకదాన్నొకటి తరుముకుంటున్నాయి. షెడ్డు ముందున్న కోడిపిల్లలు యెందుకో కంగారు పడుతూ గోల చేస్తున్నాయి. వూయలలోని పాపాయి కెవ్వుమంటూ యేడుపు మొదలు పెట్టింది. నీలమ్మ పోలికలే వున్న పడుచు పిల్ల షెడ్డు లోంచీ బయటికి వచ్చి వుయ్యాల నూపసాగింది.

"యిది మా చెల్లి... మాతమ్మ. వుండేదానికి కొంపనిండా జనమే! కానీ, యెవరుంటారో, యెవరూడతారో తెలియదు. రాత్రుల్లో వొంటిగా అగోరించాల. అందుకని తోడుగా వుండేదానికి రమ్మన్నాను. యిద్దురు బిడ్డలతో యేగలేకపోతా వుండాను. బిడ్డ నెత్తుకునే దానికి మనిషైనా కావాల గదా" అంది నీలమ్మ.

దట్టంగా పసుపు రాసుకున్న నల్లటి మాతమ్మ ముఖం చిత్రంగా మెరుస్తోంది. మెడలో నల్లపూసల దండ వేలాడుతోంది. చేతుల నిండా గాజుల దొంతర గలగల లాడుతోంది.

"నీ చెల్లి... దానికి తోడుగా దాని మొగుడూ... యిలా యెందర్ని రప్పించావు?" అని అడిగాను యెగతాళిగా.

"దానికి మొగుడు లేడులేమ్మా" అంటూ నీలమ్మ చెల్లెలి చేతిలోంచీ బిడ్డను తీసుకుని పాలివ్వసాగింది.

"నీ కళ్ళకు నేనంత పిచ్చి దానిలా కనిపిస్తున్నానా? దాని మెడలో తాడూ, కాళ్ళకు మెట్టెలూ కనిపిస్తూనే వున్నాయి..."

"దానికి మొగుడు లేడు. కానీ, రెండేండ్లకు ముందే దానికి పెండ్లయిపోయింది. అది మనువాడింది మాతమ్మని..." రెండు నిమిషాలు ఆగి, ఆ తరువాత తన సమాధానానికి మరికొంత వివరణను సరఫరా చేసింది నీలమ్మ. "మాతమ్మ మా కుల దేవతమ్మా! యిది ఆవరాన్నే పుట్టింది.

చిన్నప్పుడు జరం వచ్చి యిదింక మాకు లేదనుకునేస్తిమి. అప్పుడు మానాయిన మాతమ్మకిచ్చి పెండ్లి చేస్తానని మొక్కుకున్నాడు. అన్నప్రకారంగా దీనికి ఆ దేవతతోనే పెండ్లి జేసినాడు."

"అయితే, దీనికింక మరి పెళ్ళి చేయరా?" అంటూ విస్తుపోయాను.

"వొకతూరి మాతమ్మతో పెండ్లయిపోయినంక మళ్ళా పెండ్లా? కండ్లు పోతాయి. దానిష్టం వచ్చినట్టు అది బతకచ్చు. దానికెవురూ ఆంక్షలు పెట్టగూడదు. దానికెవుడిష్టం వుంటే వానితో వుండచ్చు. యిష్టముంటే బిడ్డల్ని గూడా కనచ్చు. లేకుంటే లేదు. పోయిన వుగాదప్పుడు గవర్మెంటోళ్ళు యీ మాదిరి మాతమ్మలయినోళ్ళకంతా యెకరా భూమి, యిళ్ళూ యిచ్చినారు. యిప్పుడు దీనికిగూడా సొంతంగా యిల్లుండాది. చూసినావా, దీని బతుకే బాగుండాది నాకంటే!" యీ సారి గూడా నీలమ్మ ఆనందంగానే నవ్వుతోంది. మాతమ్మ బిడ్డనుచంకనేసుకుని షెడ్డులోపలికెళ్ళిపోయింది.

నేరకపోయి వీళ్ళను యింటిలోకి రానిచ్చిన నేరానికి, యెలాంటి మనుషుల్ని చూడాల్సి వచ్చింది నాకు! వీళ్ళసలు మనుషులేనా? యేరాతి యుగంలో బగుకుతున్నారు వీళ్ళు? వీళ్ళ వ్యవహారం వినడానికీ, చూడ్డానికీ నాకే సిగ్గుగా వుంది కదా? యిలా బతుకుతున్నందుకు సిగ్గూ, శరమూ లేదా వీళ్ళకు? తలంతా మొద్దుబారినట్టుగా వుంది నాకు. కళ్ళు తిరుగుతున్నట్టుగా అనిపిస్తోంది.

ప్రహరీగోడ దగ్గరికి రెండు ఆకారాలొచ్చి నిల్చున్నాయి.

"అదో! సుబ్రమణి గూడా వచ్చేసినాడు" అంది నీలమ్మ సంబరంగా.

కళ్ళు చికిలించుకుని చూశాను. సన్నగా బలహీనంగా, క్షయరోగిలా కనిపిస్తున్న నల్లటి యువకుడొకడు కనిపించాడు. అతడి పక్కనే పొట్టిగా, దిట్టంగా వున్న కుర్రాడొకడున్నాడు. అక్కడ నేనున్నానన్న సంగతిని గూడా పట్టించుకోకుండా వాళ్ళిద్దరూ ఖికఖికలూ పకపకలూ రువ్వుకుంటూ షెడ్డు ముందుకొచ్చి నిల్చున్నారు. వాళ్ళ రాకకోసమే యెదురుచూస్తున్నట్టుగా షెడ్డులోంచీ వో ఆడ శరీరం గడప దగ్గరికొచ్చి నిల్చుంది. ఆవిడ వయసు యాభై అయిదుకు తగ్గదు. సన్నగా, నొక్కులు పడ్డ వూదు బుర్ర లాంటి శరీరం. బాగా చినిగిన చీర. చేతికి గాజులు లేవు. మెడలోగానీ, చెవుల్లో గానీ ఆభరణమన్న ప్రశ్నే లేదు. రెండు మోచేతులకూ వెనక పసుపు రంగు పట్టేయించుకుని వుంది. అగంతకులిద్దరూ తన ముందుకు వచ్చాక ఆవిడ చేతులు తిప్పుతూ మూకాభినయం చేయసాగింది. ఆ తరువాత వాళ్ళిద్దరితో కలిసి షెడ్డుకు నూరు

గజాల దూరంలో వున్న మావిడి చెట్టు కిందికి వెళ్ళి, నేలపైన కూర్చుంది. యీలోగా గేటు దగ్గర బలంగా, పొడుగ్గా వున్న యువతి చంకలో బిడ్డతో సహా ప్రత్యక్షమయింది. నేరుగా వాళ్ళదగ్గరికెళ్ళి కూర్చుని ఆ సమావేశంలో తానూ పాలుపంచుకోసాగింది.

నీలమ్మ నాకేసి తిరిగి, కిసుక్కుమని నవ్వేసింది.

"ఆ నల్ల పాంటేసుకోనుండేదే సుబ్రమణి. ఆ మల్లమ్మ నామొగుడికి అత్తయితింది. ఆ పక్కనుండే పిలగాడు భూపాలు. మల్లమ్మ కొడుకు. ఆ చెంచమ్మ వాని పెండ్లాం" అంటూ వరసగా అందరినీ పరిచయం చేశాక, నా ముఖంలో చిడిముడిపాటు కనిపించగానే, "సుబ్రమణికి చెప్పి దినమ్మా మీ పిల్లోళ్ళను రిక్షాలో అంపించే పూచీ నాది" అని సరాయించింది నీలమ్మ.

"అయితే వాణ్ణి మాత్రం యిక్కడుండమను. మిగిలినవాళ్ళనంతా తరమగొట్టు" అన్నాను.

"అదెట్ల కుదిరితిందమ్మా! సుబ్రమణి వుండాలంటే మల్లమ్మ గూడా వుండాల్సిందే!" నేను తెల్లముఖం పెట్టడంతో నీలమ్మ మరికొంతగా విపులీకరించింది. "ఆ మల్లమ్మ నాకు వరసకు పిన్నమ్మ గదా! అది పిన్నమ్మయితే ఆ సుబ్రమణే చిన్నాయిన. వానిది మా కులం గాదు. కాపోళ్ళు. మల్లమ్మకు మొగుడు చచ్చిపోయి పదేండ్లయి పోయింది. నాలుగేండ్లగా యీ సుబ్రమణే మొగుడు. యిద్దరూ బేల్దారీ పనికి పోతారు. యిక్కడ వంట జేసుకుంటారు."

"వాడు చూస్తే పాతికేళ్ళవాడిలాగున్నాడు. అదేమో అరవయ్యేళ్ళ మనిషిలా తెలిసిపోతోంది. వాళ్ళకిదేం పొయ్యేకాలం?" అంటూ ఆక్రోశించాను.

"మొదట్లో మేము గూడా యిది బతికి బట్టగట్టే యవ్వారం గాదనుకుంటిమిలే తల్లా!" నా పరిస్థితిని పట్టించుకోకుండా చెప్పుకుపోసాగింది నీలమ్మ "కానీ, వాళ్ళు వొకరినొదిలిపెట్టి యింకొకరుండరు. సుబ్రమణికి వెంకటాపురం దగ్గిర భూములు గూడా వుండాయంట! వాళ్ళ పెద్దోళ్ళు పెండ్లి చేయాలని సంబంధాలు గూడా చూస్తావుండారంట! కానీ, యీ మల్లమ్మ కానీయడం లేదు. సుబ్రమణిని వాళ్ళ వూరికి గూడా పోనీయదు. నిన్న రాత్రి వాళ్ళిద్దరికీ పెద్ద రగడ జరిగింది. వాళ్ళ వూరికి పొయ్యేసొచ్చేదానికి దుడ్డియ్యమని ఆమెనడిగాడు సుబ్రమణి. అది లేదనింది. వాడు పంగలకట్టెతో దాని సడగులించేసినాడు. రాత్రి దాని చావు చదరమైపోయిందనే అనుకుంటిమి. సరిగ్గా అప్పుడనంగా నా మొగుడు తాగేసి యింటికొచ్చినాడు. నేను వాని నెత్తిపైన్నుండే మూదేవి దిగేటట్టుగా జగడమేసుకోని యింట్లోంచి తరమ గొట్టినాను. సందుజూసుకోని

సుబ్రమణి గూడా వుడాయించేసినాడు. రాత్రంతా యింటికే రాలేదు. తెల్లారీ తెల్లారక ముందే మల్లమ్మ కొడుకును రాయభారం అంపించింది. చూసేదానికి యామాళం మాదిరుంటాడు గానీ, భూపాలు భలే పనోడు. వలేసి పట్టుకోని తోడుకొచ్చేసినాడు చూడు..."

మామిడిచెట్టుకింద కూర్చున్న మగాళ్ళిద్దరూ బీడీలు కాల్చుకుంటున్నారు. మల్లమ్మ కోడలి తలలో పేన్లు కుక్కుతోంది. చెంచమ్మ బిడ్డకు పాలిస్తోంది. అంతర్జాతీయ రాజకీయాలు చర్చిస్తున్నట్టుగా చుట్టూ వున్న ప్రపంచాన్ని మరిచిపోయి వాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

"ఆ చెంచమ్మ కావలిస్తే ఆ మొగుడనే కుర్రాడ్ని చంకనేసుకుని పోయేటంత పెద్దదిగా కనిపిస్తోంది. అదీ యీ బాపత్తు సంబంధమేనా" అని అడిగాను వెటకారంగా.

"అదేం కాదమ్మా! పెద్దోళ్ళు చేసిన పెండ్లే! నెరబైలు దగ్గిర చేన్లలో పని చేస్తావుండేటప్పుడు చెంచమ్మ కన్ను భూపాల్‌పైన పడింది. చూసేదానికి పిలకాయ మాదిరుండాడుగానీ వాడు భలే పలాతనమైన మనిషి. పనిలోకి వంగినాడంటే యింక తిరగులేదు. దినానికి నూర్రూపాయల వరుమాణం లేకుండా యింటికి రాడు. పిల్ల తెలివిగా మరులుగమ్మించేసింది. యిప్పుడు గూడా నిమిషం యేమారదు. వాడు యెక్కడికి పోయినా యెనకాల్నే తయారయితింది. అదొకతే పదిమంది పెట్టు. వాని చెయ్యి పట్టుకోని యెట్లా లాక్కొనొస్తావుండాదో చూడు..."

నేను తలతిప్పి చూసేసరికి చెంచమ్మ భూపాల్‌తో బాటూ పందిరి దగ్గరికొచ్చేసివుంది.

"రిక్షా సుబ్రమణికిస్తానంటివా అక్కా" అని అడుగుతున్నాడు భూపాల్.

వంచిన అన్నం డేగిశాను మళ్ళీ పొయ్యి పైన వుంచుతూ, "అవున్రా! నేను మాట తప్పే మనిషి గాదు" అంది నీలమ్మ. "నమ్మి పనిలోకి పెట్టిన పెద్దమనిషికి జబాబు చెప్పాల్నా? ఆ దొంగముండా కొడుకు మాదిరిగా నట్టేట్లో ముంచేసేదాన్ని గాదు నేను. వాడు లేకపోతే నా కోడికి తెల్లారదా? అందుకే ఆ పని సుబ్రమణికి అప్పుజెప్పినాను."

"అదెట్ల కుదిరితింది? మామ నాకు నూటముప్పయి దాకా యియ్యాల. ఆ దుడ్డిచ్చేదాంకా రిక్షా నాదే." నేరుగా రిక్షా దగ్గరికి వెళ్ళి హేండిలు పట్టుకుంటూ చెప్పాడు భూపాల్.

సుబ్రమణి పరుగుపరుగునా రిక్షా దగ్గరికెళ్ళి "తాకినావంటే తోలు

వలిచేస్తాను. బండి నాదీ..." అంటూ హుంకరించాడు.

"నువ్వు తాకు బావా, యేం చేస్తాడో చూస్తాను. మొగాన మీసాలుంటే నీ వొళ్ళు పైన దెబ్బ పడనీ చెప్తాను." చంకలోని బిడ్డ కెవ్వుమని అరుస్తున్నా వినిపించుకోకుండా ముందుకు వురుకుతోంది చెంచమ్మ.

"ముందు మా దుడ్డు అక్కడ పెట్టేసి మాట్లాడే నీలమ్మా! పెద్ద పులావరు మాదిరిగా రిక్షాను యెవురికంటే వాళ్ళకు యిచ్చేదానికి నీకు పుడసత్తు లేదు. మా సుబ్రమణికియ్యకపోయినావంటే నీకు తగలబోయేది ధూమే!" తన వయసును గూడా మరిచిపోయి, నిన్న రాత్రి పట్టేయించుకున్న చేతుల్ని ముందుకు చాపుతూ లేడిలా ముందుకు పరిగోత్తుకొస్తోంది మల్లమ్మ.

భూమ్యాకాశాలు తలకిందులైపోయినట్టుగా విభ్రమం కలిగింది నాకు. కళ్ళుబైర్లు కమ్ముతున్నట్టుగా వుంది. లోకమంతా అలుక్కుపోయినట్టుగా కనిపిస్తోంది. వణుకుతూనే లేచి నిల్చున్నాను. శక్తినంతా కూడగట్టుకుని, "నోళ్ళు మూయండి అందరూ" అంటూ పెద్దగా ఆక్రోశించాను. "యిది యిల్లను కుంటున్నారా, లేకపోతే అడివనుకుంటున్నారా? మీ బతుకులకు మానాభిమాలేమీ లేవా? కడుపుకు యేం తింటున్నారు? ముందు మా షెడ్డు ఖాళీ చేసి బయటికి చావండి. సాయంకాలానికిక్కడెవరైనా కనిపిస్తే పోలీసుల్ని పిలిపించి జైల్లోకి తోయిస్తాను."

2

ముక్కుపుడక.

తెల్లరాయి ముక్కుపుడక.

నా అరచేతిలో నక్షత్రంలా మిణమిణా మెరుస్తోంది.

దీన్ని కేవలం వొక బంగారు వస్తువులా అనుకోవడానికి మనసొప్పడం లేదు. తలలా తెల్లరాయీ, శరీరంలా బంగారుగొట్టమూ, పాదాల్లా వెనకున్న మూత - మొత్తంగా జీవమున్న ప్రాణిలాగే కనిపిస్తోంది.

నేనెన్నో దినాలుగా కోరుకుంటున్న అమూల్యమైన వస్తువు యిది. యిన్నాళ్ళ తర్వాత, యిన్నేళ్ళ తర్వాత నా చేతికొచ్చింది. వుత్కంఠ వల్ల కాబోలు, నా అరిచేయి కూడా వణుకుతోంది. అద్దంలో చూసుకుంటూ ముక్కుపైన తొడుక్కున్నాను. కనురెప్పలూ, పెదవులూ తత్తరపాటుతో వణుకుతున్నాయి. ముక్కుపుడక తెల్లటి కాంతుల్ని విరజిమ్ముతోంది. కన్యాకుమారి విగ్రహం జ్ఞాపకం వచ్చింది మళ్ళీ. చీకట్లో గూడా మెరుస్తుందట కన్యాకుమారి ముక్కుపుడక. రెండడుగులు వెనక్కు వేశాను. ముక్కుపుడక వెలుగుల్లో

అద్దంలోని నా ప్రతిబింబం సంబరంగా నవ్వుతోంది. కొంచెం కుడివైపునకు వాలుతూ కాస్సేపూ, యెడమవైపుకు తూలుతూ కాస్సేపూ అద్దంలో సుద్దులు చూశాను. లైట్ స్విచ్ వేసి, విద్యుద్దీపం వెలుతుర్లో ముక్కుపుడక అందాన్ని మోజు తీరా చూడసాగాను.

మెట్లదగ్గర చెప్పులశబ్దం వినిపించింది. ఆయన వస్తున్నారు. అయ్యో! టయమెంతయింది? గోడిగడియారం పదకొండు దాటినట్టుగా చెబుతోంది. వంట గదిలోని కుక్కర్ విజిలేస్తోంది. బాత్రూంలో పనిమనిషి బట్టలుతుకు తున్నట్టుంది. గడపకివతలికి చెప్పులొచ్చినట్టున్నాయి. బహుశా ఆయన సోఫాలో కూర్చొని వుంటారు. ఫానైనా వేసుకున్నారో లేదో! యెండన బడి వచ్చారు కదా! చెమట పట్టే వుంటుంది. వెళ్ళి ఫానయినా వేస్తాను. హడావుడిగా బయటికి రాబోతుంటే ముక్కుపుడక జ్ఞాపకం వచ్చింది. యెంతలో యెంతపని జరిగి పోయింది! కంగారుపడుతూ అద్దం దగ్గరికి వెళ్ళి గబగబా ముక్కుపుడక వూడదీశాను. తొందరలో గొట్టం జారికింద పడిపోయింది. ఆదుర్దాతో వంగి చూశాను. నా అదృష్టం బాగానే వుంది. స్టూలు దగ్గరే పడివుంది. ముక్కుపు డకను కొంగుముడిలో భద్రపరుచుకున్నాక డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చాను.

అనుకున్నట్టే సోఫాలో చెమటలు కక్కుకుంటూ కూర్చుని వున్నారాయన. ఫాన్‌వేసి మంచినీళ్ళు తెచ్చి పెట్టడం కోసం వంటగదిలోకి వెళ్ళాను. ఆయన చేతికి నీళ్ళగ్లాసు నందిస్తూవుండగా ముఖాన ముక్కుపుడక లేని విషయం గుర్తుకొచ్చింది. ఆయన చూస్తారేమో! యెర్రరాయి ముక్కుపుడక లేకపోతే ఆయనకు కోపం వస్తుందేమో! భయంభయంగా చూశాను. ఫర్వాలేదు. ఆయన ధ్యాస నాపైన లేదు. బతికిపోయాను.

ఖాళీగ్లాసును నాకు తిరిగిస్తూ, "ఆ పరంధాం యేం చేశాడో చూశావా" అన్నారాయన.

"యేం చేశారండీ?" అని అడిగాను ఆదుర్దాగా.

"యెల్డర్స్ ఫోరం ఆనివర్సరీ గ్రాండ్‌గా చేద్దామనుకున్నాంగదా? అసలు ఆనివర్సరీనే వద్దంటాడు. ఆ డబ్బుతో కాలనీ రోడ్లలో చెట్లు నాటిస్తాడట..." పళ్లు పటపటా కొరుకుతూ తల పైకెత్తారాయన. ముఖంలో ముక్కుపుడకలేనట్టుగా ఆయన చూసేస్తారేమో! కొద్దిగా పక్కకు తిరుగుతూ, "యెందుకని?" అని ప్రశ్నించాను.

"యీ కాలనీ పైన వున్నట్టుండి వాడికేమీ ప్రేమ ముంచుకు రాలేదు. యానివర్సరీ బాగా జరిగితే నాకెక్కడ మంచి పేరు వచ్చేస్తుందోనని వాడి

భయం. వాడికి మెంబర్లంతా వంత పాడుతున్నారు."

"పోతే పోనీలెండి. దాన్ని బాగుపరచాలని మీరొక్కరూ అనుకుంటే సరిపోతుందా? అందరికీ అక్కరుండాలిగదా! మీరు స్థాపించిన సంస్థ అనయినా వాళ్ళకు గౌరవం వుండాలిగదా! మీరెందుకలా బాధపడతారు? దానికోసమని నానా యాతనా పడి ఆరోగ్యం గూడా పాడుచేసుకుంటున్నారు. కాస్సేపు రెస్టు తీసుకోండి. మీకు జ్యూస్ తీసుకొస్తాను." నా చేతనయిన రీతిలో ఆయనని వోదార్చాక వంటింటిలోకి కదిలాను.

ఆయనెప్పుడూ యింతే! ఆయన మాటల్లోనే చెప్పాలంటే ఆయనొక వర్క్‌హాలిక్. లైవ్ వయర్. యేదోవొక వ్యాసంగం లేకపోతే యీయనకు కుదరదు. వుద్యోగం చేస్తున్నన్ని రోజులూ ప్రమోషన్లూ, పార్టీలూ అంటూ క్షణం తీరిక లేకుండా తిరిగారు. రిటరయ్యాక కాలనీలో యెల్డర్స్ ఫోరం ప్రారంభించారు. పొద్దస్తమానమూ ఆపనులతోనే తిరుగుతారు. యింటికొచ్చాక గూడా ఆ ఆలోచనల తోనే సతమతమవుతారు. యింటిపనులను పట్టించుకునే వీలుండదెప్పుడూ. పిల్లల పనులూ, యింటి పనులూ నాకే అప్పగించేశారు. నీది హోమ్ డిపార్ట్‌మెంటని నవ్వేస్తుంటారు. 'తీరిక లేని పనులు. బయటికెలాగూ రాలేవు. కనీసం విశేషాలైనా విను' అంటూ తన గొడవలన్నీ వివరంగా చెబుతూ వుంటారు. వినకపోతే మండిపడతారు. సంతోష మొచ్చినా, కోపమొచ్చినా పట్టలేం! యింటికి యెవరొచ్చినా 'యీవిడేనండీ నా విజయాల వెనకుండే వ్యక్తి' అంటూ ఆనందంగా పరిచయం చేస్తారు.

యీ కుక్కర్ పాతదై పోయింది. నీళ్ళు పొంగిపొర్లుతున్నాయి. స్టౌ ఆరిపోయింది. గాస్ వాసన వెగటుగా వస్తోంది. స్టౌ ఆపిన తర్వాత నిమ్మకాయల కోసం వెతికాను. ఫ్రిజ్‌లో రెండున్నాయి. కానీ, ఫ్రిజ్‌లో వుంచిన నిమ్మకాయలు ఆయనకు పడవు. ఆయనకి ఆస్మా. అదృష్టవశాత్తూ కప్‌బోర్డులో వో కాయ దొరికింది. ఆయనకన్నీ పద్ధతి ప్రకారం జరగాలి. లేకుంటే మనిషి అగ్గిరాముడై పోతారు. తెల్లరాయి ముక్కుపుడక నా తెల్లటి ముఖానికి నప్పదంటారు. యెరుపు రాయిదయితేనే బావుందంటారు. అయినా, నా ప్రారబ్ధం గాకపోతే, నాకేదైతే యిష్టమో, అదే ఆయనకు అయిష్టంగావాలా చెప్పండి. బహుశా నా పదహారో యేట నేను ముక్కుకుట్టుకున్నాననుకుంటాను. అప్పుడు వట్టి బంగారపు ముక్కుపుడక తయారు చేయించింది మా అమ్మ. నేను సణిగితే 'పెళ్ళయ్యాక నీ మొగుడికి చెప్పి, నీ యిష్టం వచ్చిన ఆభరణం చేయించుకో' అంటూ నవ్వేసింది. తీరా పెళ్ళయ్యాక యీయనగారేమో యిలా

సెలవిచ్చారు. యింతకూ నాకూ, యీ తెల్లరాయి ముక్కుపుడకకూ రుణముందో లేదో! నిట్టూరుస్తూ కొంగుముడినోసారి తడిమి చూసుకున్నాక పళ్ళరసంతో బాటూ హాల్లోకి వచ్చాను.

"యీ పరంధామ్‌ను సెకరట్రీని చేసింది నేనే గదా! యిప్పుడు నాకే యెసరు పెడుతున్నాడు. యూజ్‌లెస్ ఫెలో. అంతా సెల్ఫిష్‌నెస్..." చీకాకు పడుతూనే జ్యూస్ తాగేసి లేచి నిలబడి, "వెళ్ళి మిగిలిన మెంబర్లందరినీ కలిసొస్తాను. వచ్చే జనరల్‌బాడీ మీటింగులో వాడికి వుద్వాసన చెప్పాలి" అన్నారాయన.

"ఆ పరంధామ్ యీసరికే వాళ్ళను కలిశాడేమో! మీరు వాళ్ళతో జాగ్రత్తగా వ్యవహరించండి" అన్నాను.

చెప్పులు తొడుక్కోబోతున్నవారల్లా అలాగే ఆగిపోయి, "నిజమే! అయినా, నువ్వెప్పుడూ ఆ పరంధామ్‌ను చూడనైనా లేదు. యింత సరిగ్గా యెలా వూహించావు?" అని అడిగారాయన ఆశ్చర్యపడుతూ.

"భలేవారే! మీ మాటలు వింటే చాలదూ? మళ్ళీ అతణ్ణి ప్రత్యేకంగా చూడాలా యేమిటి!" అనేశాను నవ్వుతూ.

ఆయన తల పంకిస్తూ బయటికెళ్ళిపోయారు.

అమ్మయ్య! మళ్ళీ నాకు కాస్త సమయం దొరికింది. బెడ్‌రూమ్‌లోకెళ్ళి, తలుపులు వేసుకుని మరో సారి తెల్లరాయి ముక్కుపుడకను తగిలించుకుంటూ, అద్దం ముందు కూర్చున్నాను. కొమ్మపైన ముడుచుకుని కూర్చున్న పావురాయిలా, ముక్కు బుడిపె పక్కన తెల్లగా, ముద్దుగా వొదుగుళ్ళుపోతోంది ముక్కుపుడక. యెన్నిరోజుల యెదురుచూపు తర్వాత నాకు దొరికింది! మరీ పెద్ద ఖరీదేమీ గాకపోవచ్చు. కానీ, ఆ డబ్బును రహస్యంగా సేకరించుకోవడానికి నేను పడ్డ పాట్లు తలచుకుంటే నాకే నవ్వొస్తుంది. పెళ్ళయినప్పటి నుంచీ ప్రతి నెలా యింటి ఖర్చుల కోసం ఆయన డబ్బులు నా చేతికే యిస్తూ వస్తున్నారు. యెప్పుడూ జమాఖర్చులు చూపెట్టమని నన్నడగలేదనుకోండి. అంత నమ్మకం నేనంటే! అందుకే ఆయనకు తెలియకుండా యే పనీ చేసేదాన్నిగాదు. అదే అలవాటైపోయింది. చెబితే నమ్మరుగానీ, నిజానికీ కాస్త డబ్బు కూడబెట్టడానికి నాకు యేడాది కంటే యెక్కువ సమయమే పట్టింది. పాల లెక్కలో కొంత, చాకలి పద్దులో కొంత, కిరాణా ఖాతాలో కొంత, యిలా చీమలు కూడబెట్టినట్టుగా పొదుపుచేసి, చివరికీ మొత్తాన్ని కూడబెట్టాను. అక్కడికి డబ్బులు సమకూర్చు కోవడమే సులువైన పని. యెప్పుడూ ఆయన తోడు లేకుండా బజారుకు వొంటరిగా వెళ్ళినదాన్నిగాదు. ఆ బంగారు కొట్టువాడు పరిచయమున్నవాడే!

కానీ, నేను ముక్కుపుడక కొన్నానని ఆయనకు చెప్పేస్తే యేం చేయను? కొత్త షాపుకెళ్ళాలంటే బెరుకు. పక్కింటావిడతో కలిసి గుడికెళ్తున్నానని అబద్ధం చెప్పాల్సివచ్చినప్పుడు గుండెలెంతగా కొట్టుకున్నాయో! షాపులో కూర్చున్నప్పుడు యెవరైనా నన్ను వెంటాడుతున్నారేమోననీ, గమనిస్తున్నా రేమోననీ భయమే! కొట్టువాడితో మాట్లాడడానికి కూడా నోరు పెగల్లేదు. మొదటిసారిగా తప్పు చేస్తున్నానన్న కంగారొకవైపు. యింటికి తిరిగిరాగానే గబగబా బీరువాలో ముక్కుపుడకను దాచేశాను. రెండు మూడు రోజుల పాటు ఆ బీరువా దగ్గరికెళ్ళాలంటేనే భయం. యీలోగా యెవరైనా బీరువా తెరిచి దాన్ని చూసేస్తారేమోనన్న అనుమానం. చివరికి యివ్వాళ యెవరూ లేని సమయం చూసి బయటికి తీశాను.

అద్దంలో చూసుకుంటూ అలా యెంతసేపు కూర్చున్నానో తెలియదు. గడియారం మోగినప్పుడు పులిక్కిపడ్డాను. ఆయనిక భోజనానికొచ్చే సమయమయింది. అప్పడాలు వేయించాలి. ఆ పనిపిల్ల బట్టలు సరిగా ఆరేసిందో, లేదో! యీ ముక్కు పుడకతో దాని కంట పడినా ప్రమాదమే! యీ ముసలావిడకీవయసులో షోకులెందుకనుకుంటుందేమో! యెందుకైనా మంచిదని ముక్కుపుడకను మళ్ళీ కొంగుముడిలో దాచుకున్నాను.

వంటగదిలో గిన్నెలు తెరిచి చూస్తోంటే, పక్కనే యెరుపు రంగు కారియర్ కనిపించింది. మా అబ్బాయి రోజూ ఆఫీసుకు తీసుకెళ్ళే హాట్‌బాక్స్ అది. మరైతే యీరోజు వీడు కారియరెందుకు తీసుకెళ్ళలేదు? కొంపదీసి మరిచిపోయాడా? వుదయం ఆఫీసుకు బయలుదేరుతుండగా అబ్బాయీ, కోడలూ గొడవపడ్డం జ్ఞాపకమొచ్చింది. ఆవిడగారి పేరుతో లోను తీసుకుని కారు కొన్నాడు మా వాడు. తన జీతమంతా యిన్‌స్టాలుమెంటుకే సరిపోతోందనీ, ఖర్చులకు తనకు డబ్బులేవీ మిగలడం లేదనీ దాని పోరు. తనకు తెలియని ఖర్చులేమున్నాయంటూ వాడికి కోపం వచ్చింది. పిల్లల తగవుల్లో తలదూర్చవద్దని ఆయన నాకెప్పుడో వార్నింగిచ్చారు. కాబట్టి నేను మౌనంగా వింటూవుండిపోయాను. ఆవిడగారు అలిగి, వాణ్ణి లంచ్‌బాక్స్ లేకుండా ఆఫీసుకు సాగనంపిందన్నమాట!

పెళ్ళయి యిన్నేళ్ళవుతోంది, వాడికి హోటలుకెళ్ళే అలవాటు లేదని తెలియదూ దీనికి! తెలిసీ యింత నిబ్బరంగా యెలా వుండగలుగుతోంది? ఆవిడతో వాగ్వివాదానికి దిగడం వల్ల లాభం వుండదని నాకెప్పుడో తెలిసిపోయింది. కనీసం వాడైనా ఫ్యూన్ను యింటికి పంపగూడదూ? యెప్పుడూ

వాడి ఆఫీసుకు ఫోన్ చేసినదాన్ని గాదు. నెంబరు తెలియదు. డైరెక్టరీ ఫోను పక్కనే వుంది. యీ పుస్తకంలో నెంబరు వెతకడమంత కష్టమైన పని మరొకటుండదు. చివరికి నెంబరు వెదికిపట్టడానికి అరగంటయినా పట్టి వుంటుంది. ఫోన్ యెంగేజ్ వస్తోంది. యెంతసేపయినా అదే శబ్దం. ఆ ఫోన్ పాడైందేమో! మరేం చేయాలి? గంట రెండు దాటుతోంది. ఆయనగారెక్కడ తిరుగుతున్నారో? ఆకలైనా కాలేదా? విసుగ్గా, కోపంగా, టెన్షన్‌గా వుంది నాకు. పెరటి షెడ్లో ఆ సుబ్రమణో, భూపాలో, యెవడో వొకడు కనిపిస్తే వాడినైనా అబ్బాయి ఆఫీసుకు పంపవచ్చు. గబగబా పెరట్లోకి నడచాను. షెడ్‌లో నీలమ్మ మాత్రమే వుంది. మిగిలిన జనాలంతా యెక్కడికేగారో? వీళ్ళవల్ల ప్రయోజనమేమీ లేదు. కాళ్ళీడ్చుకుంటూ యింటికి తిరిగొచ్చాను.

చెప్పులు టపటపలాడించుకుంటూ ఆయన గూడా అప్పుడే లోపలికొచ్చారు. కోడలుపిల్ల నిర్వాకమేమిటో పిర్యాదు చేయబోయినదానినల్లా అలాగే ఆగిపోయాను. ఆయన పెద్దగా వుచ్ఛ్వాసనిశ్వాసాలు చేస్తూ రొప్పుతున్నారు. వొళ్ళంతా చెమటలు పోసివున్నాయి. తోటకూర కాడలా తూలిపోతూ సోఫాలో సోలిపోయారు.

బీపీ, షుగరూ వున్న మనిషి, వేళకు భోంచేయకుండా తిరిగితే యెలా? కంగారు పడుతూ గబగబా వో గ్లాసు గ్లూకోజు కలిపి తెచ్చాను. వొంట్లోకి కాస్త శక్తి రాగానే ఆయన, "యీ కాలనీవాళ్ళు బాగుపడరు. ఆ మెంబర్లందరూ పరంధామ్‌కే వంతపాడుతున్నారు" అంటూ నిట్టూర్చారు.

"వూళ్ళోవాళ్ళు యెలాపోతే మనకెందుకు? వాళ్ళ కోసం మీ ఆరోగ్యాన్ని పాడుచేసుకోవచ్చా చెప్పండి? వాడేమో అలా? మీరేమో యిలా? పైకి లేవండి! వడ్డిస్తాను" అని కోప్పడుతూ వంటగదిలోకి వెళ్ళాను.

"కలెక్టరును చీఫ్ గెస్టుగా పిలిచాం. కంట్రాక్టరు రెడ్డిగారు స్పాన్సర్‌షిప్‌కు వప్పుకున్నారు. ఆరేడు నెలలుగా యేర్పాట్లు చేస్తున్నాను. తీరా యిప్పుడు..." తినడం తక్కువగానూ, మాట్లాడడం యెక్కువగానూ ఆయన భోజన కార్యక్రమం సాగుతోంది. లేని ఆసక్తిని తెచ్చిపెట్టుకుంటూ విన్నట్టుగా నటిస్తున్నాను. నా ధ్యాసంతా లంచ్ బాక్స్ మరచిపోయిన అబ్బాయి పైన్నే వుంది. మధ్యలో యెలాగోలా సమయం చేజిక్కించుకుని, "వాడు లంచ్ తీసుకెళ్ళలేదండీ" అని వాపోయాను.

"హోటలుకు వెళ్ళుంటాడు లెద్దూ" అని తేల్చి పారేశాక, "ఆ కేశవమూర్తి యేమంటాడో వెళ్ళి తెలుసు కోవాలి. యీ సంగతి అటో యిటో యివ్వాళే

తేలిపోవాలి..." అంటూ ప్రసంగాన్ని కొనసాగించారు. మాట్లాడుతూనే చేతులు కడుక్కున్నారు. చెప్పులు తొడుక్కుని మళ్ళీ బయటికెళ్ళిపోయారు.

కడుపులో పేగులు అరుస్తోండగా నేనింకా అన్నం తినలేదన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. ఆయన అన్నట్టుగా వాడెక్కడైనా భోంచేసేస్తే బావుండును. పెళ్ళయ్యాక వాడూ, ఆ మహారాణీ హోటళ్ళకు బాగానే వెళ్తున్నట్టు పింకీ చెబుతుంటుంది. ఆకలిగానే వున్నా అన్నం దిగలేదు నాకు. తిన్న శాస్త్రం ముగించి లేచాను. గదిలోకెళ్తుండగా నా ప్రతిబింబం కనిపించింది.

చెట్లు కొట్టేసిన పొలంలా ముక్కుపుడక లేని నాముఖం బీడుబారివుంది. యివ్వాళ మరొకసారి ప్రమాదం తప్పిందన్న విషయం స్ఫురించింది. తన గొడవల్లో సొంతం మునిగిపోయి వుండడంచేత ఆయన నాకేసి తేరిపార జూడలేదు. పెళ్ళయిన కొత్తలోనయితే యిలా జరిగేది గాదు. ఆ రోజుల్లో ఆయన ధ్యాసెప్పుడూ నా ముఖం పైనే వుండేది. రోజులు గడవను గడవనూ, పాపం ఆయన తీరిక లేకుండా తయారయ్యారు.

ముక్కుపుడక కోసం కొంగు తడిమి చూశాను. కొంగుముడి వీడిపోయివుంది. కంగారుపడుతూ మళ్ళీ చూశాను. లాభం లేదు. డ్రస్సింగ్ టేబులు చుట్టూ ప్రదక్షిణలు చేశాను. యేదీ నా తెల్లరాయి ముక్కుపుడక? గత నలభై అయిదేళ్ళుగా నన్ను వూరించిన ఆభరణం? యీ జంజాటాల్లో పడి అది నా కొంగులోనే వుందన్న విషయాన్ని రెండుమూడు గంటల సేపు మరిచిపోవడమేనా నేను చేసిన పొరబాటు? యింతలో యెక్కడ జారిపోయింది? యిందాకా యెక్కడెక్కడ తిరిగాను? డ్రాయింగ్ రూం... వంటిల్లు... పడకగది... అవునవును. పెరట్లోకి వెళ్ళాను గదా! యింటి చుట్టూ తిరిగాక షెడ్ దగ్గరికి నడచాను. బాగా వంగి కళ్ళు పెద్దవి చేసుకుని నేలంతా గాలించాను. యీ అలగా జనం దొరికినా తిరిగిస్తారన్న నమ్మకమేముంది?

పొరబాటున ఆ ముక్కుపుల్ల ఆయన చేతికే దొరికిందేమో!

అందుకేనా ఆయనలా కోపంతో మండిపడుతున్నది? తన కిష్టం లేని పని చేశానని కోపమా?

మనసు పరిపరివిధాలుగా పోతోంది. షెడ్‌లో యెవ్వరూ లేరు. షెడ్ తలుపుకు తాళం వేలాడుతోంది.

యెక్కడికెళ్ళారో యీ తండా! కాలుగాలిన పిల్లిలా చెడ తిరగసాగాను.

"యేమిటి నాన్నమ్మా వెతుకుతున్నావు?" అంటూ పింకీ గొంతు వినిపించేసరికి వులిక్కిపడి తలపైకెత్తాను.

"అప్పుడే స్కూలు వదిలేశారా? టయిమెంతయింది?" అని అడిగాను తడబడుతూ.

"నాలుగున్నర దాటింది. యేం వెతుకున్నావో చెప్పు? నేనూ సాయం చేస్తాను" అంది పింకీ.

"తెల్లరాయి ముక్కుపుడక..." నోరు జారిపోయి నిజం చెప్పేశాను.

"కొత్తది చేయించుకున్నావా?" అని ప్రశ్నించిందా పిల్ల, తానూ నేల పైన వెదుకుతూ.

"నీ కోసమని..." సమయానికెలాగో వో అబద్ధం స్ఫురించింది.

ఆ పిల్ల తల పైకెత్తి నా కేసి చూడనయినా చూడకుండా, "నా కోసమా? ఛీ... ముక్కుపుడక నాకెందుకు? నేను ముక్కే కుట్టుకోను" అనేసింది.

యే ముక్కుపుడక కోసం యేళ్ళ తరబడీ కలవరించానో, దాన్ని యీ పిల్ల యెంత తేలికగా తీసిపారేస్తోంది! "ఆ ముక్కుపుల్ల దొరికిన తర్వాత దాన్ని అమ్మి పారేయ్. ఆ డబ్బుల్తో నేను జీన్సుపాంటూ, షర్టూ కొనుక్కుంటాను" అంది చాలనిదానికి. "అసలు నీకు యేదీయివ్వను. యింకా చిన్న పిల్లనను కుంటున్నావా నువ్వు? మగపిల్లాడిలా పాంటూ షర్టూ వేసుకుని మానం తీయాలా" అని కసురుకున్నాను.

ఆ పిల్లముఖం ముడుచుకుని, "అయితే నీ ముక్కుపుడక నువ్వే వెతుక్కో" అంటూ తనగదిలోకి తుర్రుమంది.

యేం ఫర్వాలేదు. ఆ మాత్రం వెతుక్కోలేనా నేను! యిన్నాళ్ళ తర్వాత నా చేతికొచ్చి, యింతలోనే యెలా మాయమయిందది? అయినా, దీనికీ, నాకూ రాసి పెట్టినట్టు లేదు. ఆయనకిష్టం లేని పని చేస్తే దేవుడికి మాత్రం కోపం రాదా?

నాకు సరిగ్గా బుద్ధి చెప్పడం కోసమే అది దారబోయివుంటుంది. దీనికంతా నా చెడ్డ బుద్ధే కారణం! అంతే! యీ వయసులో యీ వెర్రిమొర్రి కోరికలెందుకు నాకు? బీరువాకింద, టీవీ ముందు, డైనింగ్ టేబులు పక్కన, స్టౌ వెనక... యెక్కడెక్కడని వెదకను దాని కోసం? యేదీ? యెక్కడుంది? యెవరైనా కాజేశారా కొంపదీసి?

చీకాకు పడుతూ అలా యెంతసేపు వెతుకుతూ వుండిపోయానో నాకే తెలియదు.

"నాన్నమ్మా! పరంగామ్ ఫోన్ చేశారు. తాతయ్యకు గుండెనొప్పి వచ్చిందట! హాస్పిటల్‌కు తీసుకెళ్ళారట!" బిగ్గరగా అరుస్తూ పింకీ నాదగ్గరికి పరిగెట్టుకొచ్చింది.

నేనలాగే డ్రస్సింగ్ టేబుల్ ముందు కుప్పకూలి పోయాను. తలంతా మొద్దుబారినట్టయి పోయింది. నరాలు మెలితిప్పినట్టవుతోంది. వొళ్ళంతా స్థాణువైపోయింది.

"నాన్నమ్మా! నాన్నమ్మా!" పింకీ బెంబేలు పడుతూ నా భుజం పట్టుకుని కుదుపుతోంది.

కాలచక్రం తిరగడం మానేసినట్టుంది. నా ముందు జరుగుతున్న తతంగానికీ, నాకూ సంబంధమేమీ వున్నట్టు లేదు.

బిలబిలమంటూ గుంపొకటి ఆయన శరీరాన్ని యింటి లోపలికి తీసుకొచ్చింది. అబ్బాయీ, కోడలూ అక్కడే వున్నారు. యిద్దరూ బిగ్గరగా యేడుస్తున్నారు.

నేను యేడవకపోవడంతో అందరూ కంగారు పడుతున్నారు. పింకీ పెద్దగా కుదుపుతోంది నన్ను.

యెంత పని జరిగిపోయింది? వద్దువద్దంటున్నా ఆనివర్సరీ గొడవల్ని తలకు చుట్టుకుని, వొళ్ళు మరచిపోయి, యిష్టంవచ్చినట్టుగా తిరిగి, చివరకు ప్రాణం పైకి తెచ్చుకున్నారే యీయన! యింత చిన్న విషయానికే అంతగా స్ట్రెయినయిపోవాలా? యీ వయసులో అంత టెన్షను ఫీలుగావద్దని యెన్నిసార్లు చెప్పినా విన్నారు కాదు. యిప్పుడిక నా బతుకేంగాను? నేననే వ్యక్తి తనపైన ఆధారపడివున్నానన్న సంగతే మరచిపోయారే యీయన! ఆ పాడూ ముక్కుపుడక యింటికొచ్చిన వేళ! యెంత ఘోరం జరిగిపోయింది?

పింకీ దగ్గరకువచ్చి, నా పిడికిలి బలవంతంగా తెరిచి అందులో యేదో వుంచుతూ, "ఫ్రిజ్ దగ్గర దొరికింది" అంటూ గొల్లుమంది.

మరబొమ్మలా పిడికిలి తెరచి చూశాను. తెల్లరాయి ముక్కుపుడక. యేటిగట్టున పడి ప్రాణంవిడిచిన చేపపిల్లలా, నీలుక్కుపోయిన ముక్కుపుడక. పెద్దగా దుఃఖం ముంచుకొచ్చింది. కొండపేటు దగ్గర దుమికే జలపాతంలా యేడుపు నా గొంతులోంచీ విరుచుకుపడింది. అంతబాధలోనూ నాకెందుకో పింకీ జీన్సు పాంటూ, షర్టూ గుర్తుకొచ్చాయి. మరింత పెద్దగా యేడవసాగాను.

3

"షెడ్డు ఖాళీ చేస్తాంలేమ్మా! రెండు రోజులు వోపిక పట్టు. వున్న పాళాన పొమ్మంటే యెక్కడికి పోతాము?" అంది నీలమ్మ నిర్వేదంగా.

"ఆరు నెలలుగా ఆ మాటే చెబుతున్నావు. ఖాళీ మాత్రం చేయడం లేదు. దాదాపు రెండుగంటలుగా సాగుతోంది పెరట్లో మీ కాకిగోల. వారానికి కనీసం

రెండుమూడుసార్లయినా మీరిలా పిచ్చిగుంట్లవాళ్ళలా తగవులాడుకోవడం, యిరుగు పొరుగు వాళ్ళు మమ్మల్ని విసుక్కోవడం, గొడవ జరిగిన ప్రతిసారీ నేనిలా వచ్చి షెడ్డు ఖాళీ చేయమని గోలచేయడం, అన్నీ అలవాటైన పనులైపోయాయి. యివ్వాళ అమీ తుమీ తేలిపోవాలి" అన్నాను నేను యింకా గసపోస్తూనే.

అంతవరకూ మెగాఫోన్లలా గొంతు చించుకుంటున్నవాళ్ళు నా రాకను గమనించగానే నోటిబీగాలు తగిలించేసుకున్నారు. అందరూ మూగెద్దుల్లా మారిపోయారు. షెడ్డు ముందు పందిరి వాసానికి వేలాడుతున్న వుయ్యలలోని పాపాయి యింత గొడవ జరుగుతున్నా యెలా నిద్రపోతోందో నాకర్థం గావడం లేదు.

నాలుగేళ్ళ ఆడపిల్ల గూడా తదేక దీక్షతో మసిబారిన గిన్నెల్ని తోముతోంది. కాంపౌండ్ గోడపక్కనున్న జానెడు నీడలో వొదుగుళ్ళుపోతూ కూర్చునివున్నాడు భూపాల్. పక్కనే వాడిపెళ్ళాం బిడ్డతో సహా యుద్ధానికి బయల్దేరిన వీర వనితలా హుంకరిస్తూ నిలబడివుంది. మధ్యాహ్నం కడుపునిండా తిన్న తర్వాత, నోరు యెర్రబడేలా తాంబూలం గూడా సేవించి, తీరికగా పోట్లాటకు కూర్చున్నట్టుంది నీలమ్మ.

చెట్ల కొమ్మల్లోంచీ యెండ మిణమిణా మెరుస్తోంది. గాలి వీచినప్పుడల్లా నేలపైన తివాచీలా రాలిన యెండుటాకులు పరపరా శబ్దం చేస్తున్నాయి.

"మా అబ్బాయి పిల్లలిద్దర్నీ స్కూలుకు కారులోనే దిగబెడుతున్నాడు. రిక్షాతో మాకిక పనిలేదు. మీరంతా యిక్కడెందుకు? రెండు రోజుల్లో ఖాళీ చేయకపోతే పోలీసులకు ఫోన్‌జేస్తానంటున్నాడు మా అబ్బాయి. పోనీ పాపమని నేనే తాళజెప్పుతున్నాను. త్వరగా ఖాళీ చేసి వెళ్ళిపోండి." అలసట తీర్చుకోవడం కోసం పక్కనున్న నులక మంచం పైన కూర్చుంటూ మరోసారి హెచ్చరించాను.

"మాలాంటోళ్ళకు రిక్షా వుండినా వొకటే, లేకపోయినా వొకటేలేమ్మా! బాడిగకు తోలి రెండు దమ్మిడీలు సంపాయించుకోనొచ్చే తెంపు గూడా మా మగోళ్ళకు లేదు" అంటూ నిష్టూరపోయింది నీలమ్మ.

"నువ్వట్ల మాట్లాడితేనే నా కొళ్ళు మండేది" పైకి లేచి, ముందుకో రెండడుగులు సారిస్తూ భూపాల్ దబాయించసాగాడు. "పోయిన నెలలో రిక్షా నా దగ్గిరునింది పది దినాలే! కానీ, నీకు యెంత వరుమానం వచ్చింది? నూర్రూపాయలకు తగ్గిందా? వోడు వోడు అని అంతా వోడని అనద్దు..."

"నూర్రూపాయల బాడిగా వచ్చింది. యిన్నూరు రూపాయల రిపేరూ వచ్చింది" అంది నీలమ్మ మూతి ముడుచుకుంటూ.

"బండి డొక్కుదయితే రిపేర్లు రావా? దానికి మేమెట్ల జబాబుదారీ?" యీసారి మొగుడి తరపున చెంచమ్మ లాపాయింట్ లాగింది.

నీలమ్మ పైకిలేచి నులకమంచం దగ్గరికొచ్చి నిల్చుని, "పోయిన నెలలో నా రిక్షా సుబ్రమణి దగ్గిర పద్దెద్దినాలునింది. అప్పుడు దాని రిపేరు యిప్పుడెట్ల వచ్చింది?" అంటూ నన్నే చెంచమ్మగా వూహించుకుని, చూసేవాళ్ళు పొరబాటు నా వల్లే జరిగిందని అనుకునేలా వో ప్రశ్నను నాపైకి విసిరింది.

చెంచమ్మ సైతం నులకమంచపు మరో చివరకొచ్చి, నేలపైన చతికిలబడుతూ "పద్దైదు దినాలుగా వోవరాయిలింగు చెయ్యించకుండా తొక్కీ తొక్కీ దాని ప్రాణం తీసేసిందేమో వాడు! నిందేమో మాపైన! యిదేమైనా న్యాయంగా వుండాదా నువ్వే చెప్పమ్మా" అంటూ నాకే సమాధానం చెప్పింది.

నా మౌనాన్ని సైతం ప్రోత్సాహంగానే భావిస్తూ "బండిని అణవరించుకునే శక్తి లేకపోయినప్పుడు తప్పును బండిపైనైనా తోస్తారు, లేకపోతే యింకో మనిషి పైనైనా తోస్తారు. అంతేలే" అంది నీలమ్మ తన వాదనను కొనసాగిస్తూ.

"పుట్టి భూమ్మీద పడినాంక మేము యింకో రిక్షాను కండ్ల జూసుంటే గదా!" చెంచమ్మ వెటకారం చేసింది.

"కష్టపడి సంపాయించిన దుడ్డయితే యెవురికైనా భయమూ, భక్తీ వుంటాది. వూరికే వచ్చిందిగదా అని నా రిక్షాను యే సిన్మా కొటాయి కాడనో దొంగల్దోలేసి పొయ్యుంటావు. నీ పెండ్లానికి సిన్మాలంటే యెంత పిచ్చో నాకు తెలియదా?" నీలమ్మ యీసారి భూపాల్‌తో నేరుగా ఢీకొంది.

"సినిమా కొటాయిలకాడ మూడురూపాయలు బాడిగ కట్టి రిక్షాను షెడ్డులో పెట్టినాంకే సినిమాకు పోవాల... దానికీ దీనికీ సంబంధమేముండాది? అయినా యిప్పుడది ముందు మాదిరిగాదు. సిన్మాలు చానా తగ్గించేసిందిలే" అన్నాడు భూపాల్ భార్యకు వత్తాసు పలుకుతూ.

"సినిమావుంటే చాలు, తిండిగూడా పన్లేదు దానికి! నువ్వు కాయిలాబడి ఆస్పత్రి బెడ్డులో వున్నప్పుడు గూడా సిన్మాలు వదల్లేదది. ఆ సంగతి నాకు తెలియదా?" నీలమ్మ గొంతులో హేళన స్పష్టంగా ధ్వనించింది.

"చూడు మేయ్! నీ రిక్షా మాకు బాడిగకిచ్చినావు. బాడిగ తీసికో. అదీ నీ పని. యెవురు యెక్కడుండాల్నో అణ్ణే వుండాల. నా సొత్తు. సిన్మాలకైనా పోతాను. యేమైనా చేస్తాను. మొగుడికి జరమొచ్చిందని నాకు ఆకిలిగాదా?

తిండి తిననా? సిన్మాగూడా అంతే. నన్ను కాదనేదానికి నా మొగుడికే గుండెల్లేవు. నడిమధ్యలో నువ్వెవురు నన్నడిగే దానికి?" పదునైన కత్తుల్లాంటి మాటల్ని రువ్వుతున్న చెంచమ్మ స్విచ్ ఆఫ్ చేసిన బొమ్మలా హఠాత్తుగా నోరు మూసేసింది.

అంతవరకూ భార్య మాటలకు వంత పలుకుతున్నట్టుగా తలవూపుతున్న భూపాల్ గూడా తలతిప్పి పెరటి గేటు వైపుకు చూడసాగాడు.

నీలమ్మ మంచం దగ్గరగా వచ్చి నాకేసి వంగి నిల్చుని, "అది మా రిక్షా బెల్లే! అది చెవినబడగానే వీళ్ళిద్దరికీ యెట్ల నోళ్ళుబడిపోయినాయో చూసినావమ్మా! రిక్షా కావాలని సుబ్రమణితో పందానికి దిగినప్పుడుండే తెంపు, దాన్ని అణవరించేటప్పుడు లేదుగదా యీ భూపాలుకు? తలదాచుకునేదానికి రవంత జాగాయిచ్చినాననే మర్యాద గూడా లేకపోయింది వీళ్ళకు. సుబ్రమణీ, మల్లమ్మా వొకపక్కా వీళ్లిద్దరూ యింకోపక్క- రగడంటే రగడ గాదు. రెండుమూడు దినాలుగా వాళ్లకూ వీళ్లకూ మధ్యలో మాటలు గూడా లేవు" అంది నాతో రహస్యం చెబుతున్నట్లుగా తగ్గించిన స్వరంతో.

రిక్షాను వాకిలికవతల నిలిపిన తర్వాత, తుండుగుడ్డతో చెమట తుడుచుకుంటూ పందిరి కిందికి వచ్చాడు సుబ్రమణి.

రిక్షా సీటుపైన కూర్చున్న మల్లమ్మ గూడా ప్రహరీ గోడ దగ్గర నిల్చున్న కొడుకునూ, కోడలినీ గమనించనట్టుగా నేరుగా నీలమ్మ దగ్గరికే వచ్చి నిల్చుని, "కృష్ణాపురం ఠాణా దగ్గిర నీ మొగుడు మమ్మల్నిద్దరినీ నిలేసినాడు" అంటూ వర్తమానాన్ని అందజేసింది.

యెంతకూ నీలమ్మ ఆ వార్తపైన ఆసక్తిని చూపకపోయేసరికి, "రిక్షాను బలవంతంగా లాక్కోబోయినాడు. వానిదగ్గిర్నుంచీ తప్పించుకోనొచ్చే దానికి బ్రమ్మప్రెళయమైపోయింది" అని మరికాస్త వివరణను జోడించింది.

"అది నా రెక్కలకష్టంతో సంపాందించిన రిక్షా. దాని మింద వాని అధికారమేముండాది?" తనకు సంబంధించిన విషయం కాదన్నట్టుగా యథాలాపంగా నీలమ్మ వాకబు చేసింది.

"దాంట్లో వాని దుడ్డు యేడునూర్ల దాంకా వుందంటగదా?" అంది మల్లమ్మ.

"నా దుడ్డు వెయ్యిన్నిఅయిదునూర్లదాంకా వుండాది. దాని సంగతేమని అడగలేకపోతివా?" గోడకు విసిరిన బంతి వెంటనే వెనక్కు తిరిగొచ్చినట్టుగా నీలమ్మ ప్రశ్న వెంటనే దూసుకొచ్చింది.

"వస్తాడంటా! నేరుగా వచ్చి నీ దగ్గిర్నుంచే రిక్షా తీసుకొనిపోతాడంట. దొంగతనం జేసినానా జంకే దానికి అని దబాయించినాడు. యీ భూప్రపంచంలో యింకో మనిషికి భయపడాల్సిన కర్మ పట్టలేదని మొరాయించినాడు." చెబుతూనే మల్లమ్మ షెడ్డులోకి వెళ్ళిపోయింది.

"రిక్షా రిపేరుకు నూట ముప్ఫయి మూడు అయింది. నీకియ్యాల్సిన యిన్నూరులో మిగిలింది అరవయ్యేడు. లెక్కజూసుకో" అంటూ చిల్లర డబ్బుల్ని నీలమ్మ గుప్పిటినిండా పోశాక సుబ్రమణి గూడా షెడ్డు లోపలికి వెళ్ళిపోయాడు.

భూపాల్ దంపతులకేసి చూశాను.

వాళ్ళిద్దరూ షెడ్డు లోపలికి కోపంగా చూస్తున్నారు.

నేను నవ్వుతూ, "నీ మొగుడెప్పుడు తిరిగొచ్చాడు?" అని నీలమ్మను అడిగాను.

డబ్బుల్ని తన వక్కాకు సంచిలో భద్రపరచుకుంటూ, "వూళ్ళోకి వచ్చి నెల రోజులైపోయింది లేమ్మా! అయినా వానికి నా ముఖం చూసే ధయిర్నం లేదు. సావిత్రమ్మ - అదే వాళ్ళ పిన్నమ్మావాళ్ళు, చెన్నారెడ్డి కాలనీలో బాడిగ యిల్లు తీసుకొనుండారు. అక్కణ్ణే వుండారు వాళ్ళిద్దరూ" అంది నీలమ్మ.

షెడ్డులోకి వెళ్ళాలో, బయటికెళ్ళాలో తోచకపోవడంతో భూపాల్ దంపతులిద్దరూ బెంబేలు పడుతున్నట్టుగా కనిపిస్తున్నారు. షెడ్డు లోపలి నుంచీ శబ్దమేమీ వినరావడం లేదు. వూయలలోని పాపాయి చీమ కుట్టినట్టుగా కెవ్వున యేడవసాగింది.

నీలమ్మ వుయ్యాలనూపసాగింది. సామాన్లు కడగడం పూర్తిచేసిన నీలమ్మకూతురు జామచెట్టు చుట్టూ రాలిన పళ్ళకోసం వెతుకుతోంది.

"వాళ్ళిద్దరూ అంటే?" కుతూహలంతో ప్రశ్నించాను.

"యిప్పుడు వాడు మాతమ్మతో వుండాడులేమ్మా!" నీలమ్మ అదేమంత పెద్ద విషయం కాదన్నట్టుగా సమాధానం చెప్పింది.

"మాతమ్మ అంటే మీ చెల్లెలే కదా!" నివ్వెరపోయాను.

"దాంట్లో దాని తప్పేమీ లేదులేమ్మా. యెవుడు దుడ్డిస్తే వానితో బతకాలని దానికి రాత రాసుండాది. అదేం చేస్తింది? వీనిదే నిలకడ లేని బుద్ధి. అదిగాకపోయుంటే యింకొకదాన్ని చూసుకొనుంటాడు. రెండో పెండ్లోన్ని నమ్మగూడదని మా అమ్మ సకల విధాలుగా చెప్పింది. నేనే యినలేదు. అనుభోగిస్తా వుండాను." నీలమ్మ ముక్కు చీదుకుంది. మరి కాసేపు గడిచాక స్వగతంలా, "ఆ మొదుటి పెండ్లాం బుద్ధి మంచిది గాదని వూరు వూరంతా

చెప్పింది. వీని తప్పులేదు గదా అని అడుసు తొక్కినాను. కాళ్ళకు బురదయిందని కాళ్ళు నరుక్కుంటామా? కడుక్కుంటే అదే పోతింది" అంటూ గొణిగింది.

వున్నట్టుండి కోపమూ, చిరాకూ, అసహనమూ నన్ను ముప్పేటగా ముంచేశాయి.

అడవిలో మృగాల్లా, నీతీనియమమూ లేకుండా జీవించే యీ అనాగరిక తండా వ్యవహారంలో నాకు ఆసక్తి యెందుకు? వీళ్ళను గూడా మానవులే అనుకుని యిన్నాళ్ళూ మా యింటిలో వుండనిచ్చిన నా బుద్ధిహీనతకు నేను సిగ్గుపడాల్సిందే! యెక్కడో డ్రెయినేజీ కాలవల పక్కన, మురికివాడల్లో మాత్రమే నివసించడానికి పనికొచ్చే యీ ఆటవికుల్ని యిలాంటి సంపన్నుల వీధిలోకి రానివ్వడమే పొరపాటు.

"పెళ్ళాన్ని నట్టేట్లో ముంచేసి తన బతుకుతాను బతికే వాడొక మొగుడు! వాడెలా పోతే నాకేమయిందనుకునే నువ్వొక పెళ్ళాం! బలే జోడీ! మీ నీడ పడిన నేలకు గూడా పాపం చుట్టుకుంటుంది. ముందు నువ్వు బయటికి నడువు." ఆవిడ సమాధానాన్ని వినాల్సిన అవసరం లేకపోవడంతో వెనుదిరిగి నడుస్తూ ఫర్మానా జారీ చేశాను.

"నేనేమైనా తెగతెంపులు చేసుకోనిపొమ్మన్నానా తల్లా? వాడేం చేసినా భూమాత మాదిరితో కడుపులో పెట్టుకున్న దాన్నేగానీ బయట పడుందునా? కడాకు నా ముక్కుపుల్లను గూడా యిచ్చెయ్యమని పోరుపెడ్తే యేంచేసేది? యియ్యను పొమ్మన్నానని అలిగిపొయినాడు. దాంట్లో నా తప్పేముండాది?"

అన్యమనస్కంగా నడుస్తున్న నేను, ముక్కుపుడక మాట చెవినబడగానే వులిక్కిపడి వెనుదిరిగాను. యీ ప్రపంచంతో యిక తనకేమీ సంబంధం లేదన్నట్టుగా, బీరువా సొరుగులో దాక్కున్న నా తెల్లరాయి ముక్కుపుడక... యెలా వుందో అదిప్పుడు?

"ముక్కుపుడక కోసం అలిగాడా?" వుత్కంఠతతో వణకుతూ ప్రశ్నించాను.

"యింక దేనికోసరమనుకున్నావు? నా పెండ్లప్పుడు వాళ్ళమ్మదని చెప్పి మా అమ్మ నాకిచ్చింది. అప్పటినించీ భద్రంగా పెట్టుకోనుండాను. నా దగ్గిరుండే బంగారమంతా అదే! దాన్నెట్టయినా కొట్టేసి సారాయంగిడోనికిచ్చేసి, జల్సా చేసెయ్యాలని వాని చూపు. రిక్షా మూలబడినప్పుడూ, చిల్లర చేతిలో ఆడనప్పుడూ దాన్ని వొలిచిమ్మని చంపుకోని తిన్నాడు. యెన్ని దెబ్బలయినా భరాయించినానేగాని వానికియ్యలేదు. సత్య ప్రమాణకంగా చెప్తావుండాను తల్లా?

అది ముక్కుపుల్లగాదు, నా ప్రాణం!"

కళ్ళార్పడం సైతం మరచిపోయి నీలమ్మకేసి చూడసాగాను.

చాలా రోజుల తర్వాత నీరందినప్పుడు, తిరిగి లేచి నిలబడ్డ పూలమొక్కలా నీలమ్మ తన ముక్కుపుడక జ్ఞాపకం రాగానే రీవిగా నిలబడి పోయింది.

అంతవరకూ ఆమె ముఖంలో తారట్లాడిన నీడలన్నీ పటాపంచలై పోయినట్టున్నాయి. పెట్రోమాక్సు దీపంలా అది వెలిగిపోతోంది.

"అది నన్నెన్నిసార్లు కాపాడిందనుకున్నావు?" నీలమ్మ గొంతు కంచు గంటలా టంగున మోగుతోంది. "వీన్ని నమ్మితే నట్టేట్లో మునిగినట్టే! వీడు కాళ్ళు జాపేసినప్పుడంతా దాన్ని అడమాణం పెట్టి నెట్టుకొస్తావుండాను. దాన్నిచూస్తే నాకు నాబిడ్డల కడుపు గుర్తుకొస్తాది. అరమూట బియ్యం కండ్లముందు మెదల్తాది..."

చివుక్కున చిరాకు ముంచుకొచ్చింది నాకు. అందమైన ముక్కుపుల్లను చూస్తే కాలే కడుపులూ, బియ్యం బస్తాలూ జ్ఞాపకం రావడం యేం బావుంటుంది? ఛీ... ఛీ... అలగా జనం, అలగా బుద్ధులూ...

"నేను కావాల్నా, ముక్కుపుల్ల గావాల్నా అని నిలదీసి అడిగినాడు. రచ్చరచ్చ జేసినాడు. నేను దిగిరాలేదు. యీ మాదిరిగా యెప్పుటికైనా నన్ను దిగ్గొలికేస్తాడని నాకు తెలుసు. యిప్పుడు ఆ ముక్కుపుల్లేగదా నన్ను ఆదుకునింది. దాన్ని మాతమ్మ దగ్గిర ఆడమాణం పెట్టి యిన్నూరు రూపాయలు తెచ్చుకున్నాను. రిక్షా రిపేరుకు అదేగదా పనికొచ్చింది." తడబాటు లేకుండా తాపీగా, నిబ్బరంగా చెబుతోంది నీలమ్మ.

అంత చిరాకులోనూ నీలమ్మ బుద్ధిహీనతను చూడగానే నవ్వొచ్చేసింది నాకు. యింత గొడవా జరిగిన తర్వాత తాకట్టు పెట్టడానికి మాతమ్మే దొరికిందా యీ మూర్ఖురాలికి?

"మాతమ్మ దగ్గర్నుంచీ నీ మొగుడు లాక్కుంటే?" ఆలోచనకంటే ముందుగా ప్రశ్నే నా నోటినుంచీ దూసుకొచ్చింది.

"మాతమ్మ దగ్గిరునిందంటే యినప్పెట్టెలో వున్నట్టే! మొగోడెవుడైనా వానిదగ్గిరుండేది దానికిచ్చి మచ్చిక చేసుకోవాల్సిందే! దాని దగ్గిర్నుంచీ పైసా వూడబెరుక్కునే శక్తి యెవుడికీ లేదు. ఆ మాదిరి లేకుంటే యీ మగోళ్ళు దాన్ని వూది పారేసుండరా? యిప్పుడు జూడు! గవర్మెంటోళ్ళు యిచ్చిన యిల్లు బాడిగకిచ్చేసింది. వాడు బాడిగకు తీసుకున్న యింట్లో వుండాది. దమ్మిడీ ఖర్చు లేకుండా జీవనం గడిచిపోతావుండాది. నెలపెడ్తే రూకలు వొళ్ళో పడతాయి. అదీ

దాని నేర్పు."

కలగుండు పడ్డ చెరువులా నా మనసంతా కకావికలైపోయింది.

వున్నట్టుండి పెద్ద బరువేదో నాపైన పడ్డట్టుగా శరీరం తూలసాగింది. కాళ్ళకింది నేల కూలిపోయినట్టుగా, నేనేదో అగాధంలోకి పడిపోతున్నట్టుగా తోస్తోంది.

యేదిమంచో, యేదిచెడో అర్థంగాని అయోమయంలో పడి కొట్టుకు పోతున్నట్టున్నాను. అడుగులు గాలిలో తేలిపోతున్నాయి.

కాస్త దూరం నడిచాక, అన్యమనస్కంగానే వెనుదిరిగాను. షెడ్డు దగ్గరకొచ్చి నిల్చొని, "చూడు నీలమ్మా, ముందు యీ గుంపునంతా తరిమేసెయ్యి. నువ్వుగూడా వీలయినంత త్వరగా యింకో చోటు వెతుక్కో. సాయంత్రమొకసారి కనబడు. యింకెప్పుడూ ఆ ముక్కుపుడక తాకట్టు పెట్టొద్దు. నీకెప్పుడైనా అంతగా అవసరం వస్తే నా దగ్గరికి రా. ఆ డబ్బేదో నేను యిస్తాను" అన్నాను.

(యిండియాటుడే వార్షిక సంచిక, 2000)

❖❖❖